క్లుప్తంగా

పైపులైన్ లీకేజీకి మరమ్మతులు



పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని హిమాయత్‌నగర్ సాయిబాబా దేవాలయం సమీపంలో రోడ్డు పక్కన పైపులైన్ మరమ్మతుల కోసం నాలుగు రోజుల క్రితం గుంత తీసి సిబ్బంది పనులు పూర్తి చేయకుండా అలాగే వదిలేయడంతో గుంత నిండా పైపులైన్ లీకేజీతో నీరు నిండి ప్రమాదకరంగా మారింది. దీనిపై ప్రమాదకరంగా గుంత.. ప్రయాణికుల చింత అనే శీర్షికన బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి పనులు ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి సిబ్బందితో పైపులైన్ పనులను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు, వాహనదారులు సాక్షి పత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



శిబిరంలో రక్తదానం చేస్తున్న ప్రజలు

మొయినాబాద్‌రూరల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని చైతన్య యూనివర్సిటీ కులపతి డాక్టర్ పురుషోత్తంరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లో గల యూనివర్సిటీలో రక్తదాన శిబిరాన్ని కోటిక్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూనివర్సిటీ కులపతి డాక్టర్ పురుషోత్తంరెడ్డి పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరానికి మంచి స్పందన లభించిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కోటిక్స్ ఆస్పత్రి డాక్టర్ శ్రీకాంత్, అడ్మినిస్ట్రేట్ అధికారి సాత్వికరెడ్డి, డాక్టర్ పవన్‌కుమార్, శంకర్, కుమారస్వామి, గాయత్రీ, గోపినాథ్, రాంబాబు, రవీందర్ పాల్గొన్నారు.

కేశంపేట ఎస్‌ఐగా రాజ్‌కుమార్



బాధ్యతలు స్వీకరిస్తున్న రాజ్‌కుమార్

కేశంపేట: కేశంపేట నూతన ఎస్‌ఐగా రాజ్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న లింగం కేపీహెచ్‌బీకి బదిలీ అయ్యారు. శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న రాజ్‌కుమార్ కేశంపేటకు బదిలీ అయ్యారు. లింగం ఇక్కడి నుంచి వెళ్లగా రాజ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు.

రైతులను అడ్డుకున్న వారిపై చర్యలకు వినతి



తహసీల్దార్ ఎండీ అన్వర్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

చేవెళ్ల: రైతులను నక్షబాట నుంచి వెళ్లకుండా అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని ముద్దెంగూడ గ్రామస్తులు డిమాండ్ చేశారు. బుధవారం షాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎండీ అన్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. మండల పరిధిలోని ముద్దెంగూడ నుంచి ఎర్రోనిగూడ గ్రామానికి వెళ్లే నక్షబాటకు దారి ఇవ్వాలని గ్రామస్తులు కోరామని తెలిపారు. ఎర్రోనిగూడ గ్రామానికి వెళ్లే దారి పక్కన ఉన్న భూమి సర్వే నెంబర్ 1480లో ఒగ్గు చిన్న యాదమ్మకు 7 ఎకరాల 38 గుంటలు, ఒగ్గు శివకుమార్‌కు 2ఎకరాల 26 గుంటలు, ఒగ్గు సంపత్‌కుమార్‌కు 2 ఎకరాల 26 గుంటల భూమి ఉంది. అయితే అదే దారి గుండా గ్రామానికి చెందిన రైతుల పొలాలు ఉన్నాయి. వారి పొలాలకు వెళ్లాలంటే ఈ నక్షబాట నుంచి వెళ్లాలి. ఈ నక్షబాట నుంచి వెళ్లకుండా అడ్డంగా కంచెను ఏర్పాటు చేశారని ఆరోపిస్తున్నారు. పక్కదారిలోనే స్మశానవాటిక ఉందని, నక్షబాటకు సమస్యలు లేకుండా వారిపై తగిన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని వినతిలో కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు నర్సింలు, సురేశ్, వెంకటయ్య, తదితరులు ఉన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



చౌదరిగూడలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నాయకులు

కొందుర్గు: మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంతో పాటు ఎల్కగూడ, గాలిగూడ గ్రామాల్లో ఆయన మొక్కలు నాటారు. అదేవిధంగా గాలిగూడలో అండర్ డ్రైనేజీ, గాలిగూడ నుంచి ధర్మ్యతండా వరకు రోడ్డు ఫార్మేషన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి, పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15లోపు రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీన్‌కుమార్, నాయకులు రాజు, చంద్రశేఖర్, యాదగిరి, ఆంజనేయులు, నర్సింలు పాల్గొన్నారు.

కొందుర్గులో..

కొందుర్గు నుంచి మహబూబ్‌నగర్ దారిలో వెంకిర్యాల వంతెన నిర్మాణ పనులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంతెన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం ఆగిర్యాలలో ఇటీవల విద్యుత్ సబ్‌స్టేషన్ సామర్థ్యం పెంచిన సందర్భంగా ఎమ్మెల్యే సబ్‌స్టేషన్ సందర్శించి రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, గోవర్ధన్‌గౌడ్, లింగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు

కవయిత్రి మొల్ల విగ్రహావిష్కరణ

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా శాలివాహన సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన కవయిత్రి మొల్ల విగ్రహాన్ని బుధవారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యవారిపల్లి వంతెన నిర్మాణ పనుల పరిశీలన

మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామ శివారులో ఉన్న వాగుపై నూతనంగా నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను బుధవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరిశీలించారు. ఈ వంతెన నిర్మాణ పనులను నాలుగున్నర కోట్లతో చేపడుతున్నట్లు తెలిపారు.

మొక్కలతోనే మానవాళికి మనుగడ



చేవెళ్ల: ముడిమ్యాలలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే యాదయ్య, అధికారులు

చేవెళ్ల: మొక్కలతోనే మానవాళికి మనుగడ సాధ్యమని, ప్రతి గ్రామంలో చెట్లను పెంచి వనాలుగా మార్చాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని ముడిమ్యాల గ్రామంలో బుధవారం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే, అడిషనల్ పీడీ సుభాషిణిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి డిపార్ట్‌మెంట్‌ల వారీగా నిర్దేశించిన లక్ష్యాల మేరకు మొక్కలు నాటాలని సూచించారు. ఎవరూ నిర్లక్ష్యం వహించకుండా మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజలను భాగస్వామ్యం చేసుకుంటూ మొక్కలు నాటాలని తెలిపారు. కార్యక్రమంలో ముడిమ్యాల గ్రామస్తులు ఎంపీడీఓ హిమబిందు, ఎంపీఓ విఠలేశ్వర్‌జీ, కార్యదర్శి రియాజ్, ఈసీ రాజశేఖర్, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి

వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ శ్రీనునాయక్



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

షాద్‌నగర్: జీపీల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం కనీస వేతనాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ శ్రీనునాయక్ డిమాండ్ చేశారు. బుధవారం ఫరూఖ్‌నగర్ డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్‌సింగ్‌కు జీపీ కార్మికులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉదయం నుంచి మొదలు గ్రామాలను శుభ్రం చేయడంలో జీపీ కార్మికులు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. వారికి ప్రభుత్వం కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని కోరారు. అనేక సంవత్సరాలుగా వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రాజు, యాదయ్య, కిష్టయ్య, వెంకటయ్య, కమలమ్మ, లక్ష్మమ్మ, అంజమ్మ, యాదయ్య, రాములమ్మ, సత్యమ్మ, లక్ష్మయ్య, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

శ్రమను దోచుకుంటున్న యాజమాన్యాలు

సీఐటీయూ చందనవెల్లి పారిశ్రామిక క్లస్టర్ కన్వీనర్ దేవేందర్



చందనవెల్లి పారిశ్రామిక వాడలో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

చేవెళ్ల: పరిశ్రమల యాజమాన్యాలు కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని సీఐటీయూ చందనవెల్లి పారిశ్రామిక క్లస్టర్ కన్వీనర్ అల్లి దేవేందర్ అన్నారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని చందనవెల్లి పారిశ్రామికవాడలో దేశవ్యాప్తంగా కార్మికుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. లేబర్ కోడ్స్‌తో కార్మికుల 8 గంటల పని విధానం పోయి 12 గంటలకు చేరుకుందన్నారు. చందనవెల్లి పారిశ్రామిక ప్రాంతంలో కార్మికులకు అతి తక్కువ వేతనాలు ఇస్తూ వారి శ్రమను దోచుకుంటున్నారని మండిపడ్డారు. కార్మికులకు సీఐటీయూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ క్లస్టర్ కమిటీ సభ్యులు నర్సింహా, సత్తయ్య, రాములు, సాయిలు, తదితరులు ఉన్నారు.

నాగిరెడ్డిగూడలో..

మొయినాబాద్: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. మండల పరిధిలోని నాగిరెడ్డిగూడలో భవన నిర్మాణ కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను వేగంగా అమలు చేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వరంగ సంస్థలన్నీ ప్రైవేటీకరణ చేసేందుకు ఆరాటపడుతుందన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు ప్రభుదాస్, శ్రీనివాస్, రమేశ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత తప్పనిసరి

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్
- చనువెల్లిలో ఇంటింటి సర్వే, ప్రజలకు శానిటేషన్‌పై అవగాహన



పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారుల బృందం

చేవెళ్ల: సీజనల్ వ్యాధులు డెంగీ లాంటి కేసులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేవెళ్ల డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్ అన్నారు. మండలంలోని చనువెల్లి గ్రామానికి చెందిన బాలుడు డెంగీతో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై జిల్లా వైద్యాధికారుల ఆదేశాల మేరకు బుధవారం చేవెళ్ల డివిజన్ వైద్యాధికారులు, సిబ్బంది చనువెల్లి గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ తిరిగి ఫీవర్ కేసులు ఏమైనా ఉంటే వారిని గుర్తించి వైద్యం అందించారు. ఆరోగ్య విషయంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. 100 ఇళ్లల్లో సర్వే చేయగా ఏడుగురికి ఫీవర్ ఉన్నట్లు గుర్తించి వారికి క్యాంపు ద్వారా వైద్యం అందించి మందులు పంపిణీ చేశారు. ప్రజలు ఈ వర్షాకాలంలో ఇళ్ల చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి వడబోసిన నీటినే తాగాలన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, నీటి గుంతలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. రాత్రి సమయంలో ఏదైనా వైద్యం కావాల్సి వస్తే వెంటనే చేవెళ్ల ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి వెళ్లాలని అక్కడ అడ్మిట్ చేసుకొని వైద్యం అందిస్తారన్నారు. చనువెల్లి చుట్టుపక్కన గ్రామాల్లో కూడా ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా చనువెల్లిలో ప్రత్యేకంగా వైద్య క్యాంపుతో ఆలూరు వైద్యులు డాక్టర్ రఘుబాబు, సీహెచ్‌ఓ గోపాల్‌రెడ్డి, సుదర్శన్, బలరాం, డాక్టర్ బాలకృష్ణ, అన్వర్, పద్మ సిబ్బందితో ప్రజలకు వైద్య సేవలు అందించారన్నారు. గ్రామాల్లో ఉండే ఆర్‌ఎంపీ వైద్యులు వారి స్థాయికి మించిన వైద్యం అందించొద్దని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం



వీరయ్యను సన్మానిస్తున్న దివ్యాంగుల సమాఖ్య సభ్యులు

మొయినాబాద్: దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించిన ముత్తినేని వీరయ్యను దివ్యాంగుల సమాఖ్య సభ్యులు కలిశారు. పూలమాలలతో ఆయనను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వీరయ్యను కలిసిన వారిలో సమాఖ్య సభ్యులు నర్సింహాచారి, సురేశ్, నర్సింహా, జ్ఞానేశ్వర్, శివ, పరమేశ్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, జంగయ్య, దామోదర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విలేకరుల కమిటీ కొందుర్గు అధ్యక్షుడిగా వహీద్ అహ్మద్

కొందుర్గు: కొందుర్గు మండల విలేకరుల నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా వహీద్ అహ్మద్, గౌరవాధ్యక్షుడిగా కృష్ణయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శిగా వెంకటయ్య, ఉపాధ్యక్షుడిగా శంకర్‌జీ, కోశాధికారిగా శేఖర్ ఎన్నికయ్యారు. అనంతరం వారిని శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో విలేకరులు లక్ష్మినారాయణ, సత్యనారాయణ, బాలయ్య, లక్ష్మణ్, బాలేశ్వర్, మల్లేశ్, రవి, రుక్కయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



విగ్రహాల ఊరేగింపులో నిర్వాహకులు, కాలనీవాసులు

చేవెళ్ల: మండల కేంద్రంలోని చంద్రారెడ్డినగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చేవెళ్లలోని హనుమాన్ ఆలయం నుంచి అమ్మవారి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం ఆలయం వద్ద విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండురోజుల పాటు ఈ ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం విగ్రహ ప్రతిష్ఠాపన, బోనాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కాలనీ వాసులతో పాటు చేవెళ్ల గ్రామప్రజలు పూజల్లో పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రొజెక్టర్ బహూకరణ



జగన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గ్రామస్తులు, విద్యార్థులు

కొందుర్గు: మండలంలోని విశ్వనాథ్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు జగన్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఈ సందర్భంగా ఆయన మిత్రబృందం జగన్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాలకు రూ.19 వేల విలువ గల ప్రొజెక్టర్ బహూకరించారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రానికి రూ.11వేల విలువ గల బీరువాను అందజేశారు. అలాగే విద్యార్థులకు నోటుపుస్తకాలు, స్టేషనరీ అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మానస, ఉపాధ్యాయుడు కుమార్, అంగన్‌వాడీ టీచర్ అరుణ, మిత్ర బృందం క్రాంతి, శ్రీనివాసు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు

పేదల ఆరోగ్య సంరక్షణకు చర్యలు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య



మాట్లాడుతున్న బాబయ్య

షాద్‌నగర్: పేదల ఆరోగ్య సంరక్షణకు కేంద్రం చర్యలు చేపట్టిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య అన్నారు. బుధవారం పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు టీకా పంపిణీ కార్యక్రమంలో బీజేపీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నిరుపేదలను అన్ని విధాలుగా ఆదుకునేందుకు చర్యలు చేపట్టిందన్నారు. పేదలకు అండగా నిలిచి వారి ఆరోగ్య రక్షణకు భరోసా కల్పిస్తుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని చేపట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ప్రజలు బీజేపీని మరోసారి ఆశీర్వదించారన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. కార్యక్రమంలో నాయకుడు హరిభూషణ్ పటేల్, రాము, రంగన్నగౌడ్, విజయ్, రవినాయక్, శివ, రామకృష్ణ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

యాంటీ నార్కోటిక్ బ్యూరో ఎస్పీ సాయిచైతన్య



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న యాంటి నార్కోటిక్ బ్యూరో ఎస్పీ సాయిచైతన్య

నందిగామ: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఒకసారి మత్తు పదార్థాలకు అలవాటు పడితే మానుకోవడం చాలా కష్టమని, దీంతో భవిష్యత్ నాశనమవుతోందని రాష్ట్ర యాంటీ నార్కోటిక్ బ్యూరో ఎస్పీ సాయిచైతన్య అన్నారు. మండలంలోని మొదళ్లగూడ శివారులోని సింబాయాసిస్ అంతర్జాతీయ విశ్వవిద్యాలయంలో బుధవారం విద్యార్థులకు డ్రగ్స్, మత్తు పదార్థాల వాడకం, వాటి వాడకంతో జరిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ సాయిచంద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. యువత ఎట్టి పరిస్థితుల్లో మత్తు పదార్థాలకు బానిసలుగా మారొద్దని సూచించారు. ఎక్కడైనా డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నాయనే సమాచారం తెలిసినా వెంటనే నార్కోటిక్ పోలీసులకు గానీ, స్థానిక పోలీసులకు గానీ, 100 నెంబరుకు గానీ లేదా 8712671111కు ఫోన్ చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సంతోష్ ఆగావ్, క్యాంపస్ ఇన్‌చార్జి కల్నాల్, వేణుగోపాల్, స్థానిక ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, విద్యార్థులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

కొత్తూరు: యువత, ప్రజలు నిషేధిత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని స్థానిక ఎస్‌ఐలు శ్రీనివాస్, శ్రీనివాస్‌లు కోరారు. పట్టణంతో పాటు, కొత్తూరు తండాలో ప్రజలకు బుధవారం డ్రగ్స్ వినియోగంతో వచ్చే ఇబ్బందులతో పాటు కొత్తగా అమలైన నేర చట్టాలపై అవగాహన కల్పించారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలన్నారు. నేరాల నియంత్రణకు వ్యాపారులు, ప్రజలు తమ ఇళ్లలో సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



చేవెళ్లలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్ యూనియన్ సభ్యులు



కేశంపేటలో..

సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్లకు వినతి

చేవెళ్ల: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం జాతీయ కార్మికుల హక్కుల దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్ యూనియన్ సభ్యులతో కలిసి కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే రాబోయే రోజుల్లో స్కీం వర్కర్ల సమస్యలపై ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ సభ్యులు రాధ, సౌభాగ్య, అన్నపూర్ణ, విజయలక్ష్మి, తదితరులు ఉన్నారు.

కొత్తూరు: ఆశవర్కర్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు సాయిబాబా డిమాండ్ చేశారు. ఆశవర్కర్ల సమస్యలపై దేశవ్యాప్తంగా బుధవారం చేపట్టిన నిరసనలో భాగంగా ఆయన పలువురు ఆశవర్కర్లతో కలిసి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. అనంతరం సాయిబాబా మాట్లాడుతూ.. ఆశవర్కర్లకు ప్రభుత్వం కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, వారికి ఈఎస్ఐ, పీఎఫ్, తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ సంస్థలకు మేలుచేసే విధంగా బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను సవరించడం దారుణమని పేర్కొన్నారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆశవర్కర్ల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో విడతల వారీగా ఆందోళనలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశలు మాధవి, బుజ్జి, చిట్టి, లక్ష్మి, నందిని, అమీనాబేగం, జహంగీర్‌బీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

నందిగామ: అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బీసా సాయిబాబు అన్నారు. మండల కేంద్రమైన నందిగామలో బుధవారం పలువురు అంగన్‌వాడీ టీచర్లు, ఆశకార్యకర్తలు, ఆయాలతో కలిసి పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ రాజేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీటీచర్లు శోభారాణి, సంతోష, జానకీ, శివనీల, వరలక్ష్మి, సుజాత, బుచ్చమ్మ, సరోజ,ధనలక్ష్మి, మంజుల పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

కేశంపేట: అంగన్‌వాడీ టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్ల సంఘం షాద్‌నగర్ ప్రాజెక్టు అధ్యక్షురాలు జయమ్మ అన్నారు. హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మండల కేంద్రంలో తహసీల్దార్ అజీంఅలీకి అంగన్‌వాడీ టీచర్లు తమ హక్కులపై వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శశికళ, సంతోష, మమత, విజయలక్ష్మి, భాగ్యలక్ష్మి, మోహనమ్మ, జ్యోతి, రాములమ్మ, వజ్రమ్మ పాల్గొన్నారు.